సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 23 । మే । 2024



టన్ను చీనీ రూ.39 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.39 వేలు, కనిష్టంగా రూ.14 వేల ప్రకారం ధర పలికాయి.



భద్రత వెరీ స్ట్రాంగ్

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడిన నేపథ్యంలో హింసాత్మక ఘటనలకు తావీయకుండా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
37.3°/23.1°

జిల్లా పరిధిలో బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

అశ్వవాహనంపై లక్ష్మీ చెన్నకేశవుడు



ధర్మవరం అర్బన్: బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు బుధవారం లక్ష్మీచెన్నకేశవస్వామి అశ్వ వాహనంపై దర్శనమిచ్చారు. ధర్మవరం పట్టణంలోని పురవీధులలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుడిని ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు.

జిల్లా వ్యాప్తంగా కార్డన్ సెర్చ్‌లు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు కొనసాగుతున్నాయి. జూన్ నాలుగో తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్ జరగనుంది. ఆ రోజున గొడవలు, అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు సీఐలు, ఎస్ఐలు పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లు, అసాంఘిక కార్యకలాపాల కేసుల్లో పట్టుబడిన నేరస్తుల ఇళ్లలో సోదాలు చేస్తున్నారు. గొడవల జోలికి వెళ్ల కూడదని సూచిస్తున్నారు. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అనంతరం గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల కదలికలు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

మాతాశిశు మరణాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రశాంతి నిలయం: మాతా శిశు మరణాలు సంభవించకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి ఆదేశించారు. ప్రశాంతి గ్రామంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో మాతా శిశు మరణాలపై జిల్లా స్థాయి సబ్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఏ తల్లీ జన్మనిస్తూ మరణించకూడదు.. ఏ శిశువూ జన్మిస్తూ మరణించకూడదు.. అనే విషయాన్ని వైద్య సిబ్బంది గుర్తెరిగి పని చేయాలన్నారు. ప్రతి నెలా 9వ తేదీన ప్రతి పీహెచ్‌సీలలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించాలన్నారు. గత నెలలో జిల్లాలో మాతృ మరణాలు -1, శిశు మరణాలు -8 జరిగాయని, పొరపాట్లను గుర్తించి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి నాగేంద్ర నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సోలోమన్, పీడియాట్రీషియన్లు జోవెల్ వెస్లీ, శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

డేటింగ్.. చీటింగ్

- పుట్టపర్తికి చెందిన ఓ యువకుడు గూగుల్‌లో డేటింగ్ యాప్స్ గురించి వెతికాడు. ఓ యాప్‌లో వివరాలు నమోదు చేసి.. అవతలి వ్యక్తి నంబరు కనుగొన్నాడు. కాల్ చేసి బెంగళూరులో యువతి కావాలన్నాడు. వెంటనే సమయం, ప్రాంతం చెప్పాక.. ఫోన్‌పే ద్వారా రూ.5 వేలు పంపించాడు. ఆ తర్వాత వాట్సాప్‌లో వచ్చిన ఫొటోల ఆధారంగా వెతకాలని ప్రయత్నించగా.. బ్లాక్ చేశారని తెలుసుకున్నాడు. తాను మోసపోయినట్లు గ్రహించాడు.
- హిందూపురంలో 28 ఏళ్ల యువకుడు డేటింగ్ యాప్ ద్వారా ఓ మహిళకు పరిచయమయ్యాడు. వాట్సాప్ ఆధారంగా ఫొటోలు షేర్ చేసుకున్నారు. ఆ తర్వాత ఓరోజు డేట్ ఫిక్స్ చేసుకుని 'రేటు' తీర్మానించుకున్నారు. పేటీఎం ద్వారా రూ.7 వేలు అడ్వాన్స్ రూపంలో పంపించాడు. ఆ తర్వాత నంబరు స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు తెలుసుకున్నాడు. ఇలా.. పెనుకొండ, ధర్మవరం, గోరంట్ల, కదిరి తదితర ప్రాంతాల్లో మోసపోతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది.

- స్మార్ట్ ఫోన్ల ద్వారా ఉచ్చులో దిగుతున్న యువత
- ఫేక్ ఐడీలతో బ్యాంక్ ఖాతాలు, ప్రొఫైల్స్ ఓపెన్
- ఆన్‌లైన్ డబ్బులు చెల్లించి మోసపోతున్న యువత
- లోకల్ కాల్ నంబర్లతో హైటెక్ తరహాలో వ్యభిచారం
- రిలేషన్ పేరుతో పరిచయమై.. తర్వాత భారీ మోసం
- ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ద్వారా నగదు లావాదేవీలు

సాక్షి, పుట్టపర్తి



ఆధునిక యుగంలో అందరి చేతిలో స్మార్ట్‌ఫోన్‌లు ఉన్నాయి. షాపింగ్ నుంచి బ్యాంకింగ్ వరకు లావాదేవీలన్నీ మొబైల్ ద్వారా ఆన్‌లైన్‌లో చేస్తున్నారు. ఇందులో అతి పెద్ద మోసం 'ఆన్‌లైన్ డేటింగ్' యాప్స్. ప్రపంచ వ్యాప్తంగా ఏడాది వ్యవధిలో కొన్ని కోట్ల మంది ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌ల కారణంగా నష్టపోతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి విష సంస్కృతి ప్రముఖ నగరాల నుంచి పట్టణాలు, పల్లెల వరకు విస్తరించింది. గ్రామీణ స్థాయి నుంచి పట్టణాలకు విద్య, ఉద్యోగం కోసం వెళ్లిన చాలా మంది ఆన్‌లైన్ డేటింగ్ ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోతున్నారు. పరువు పోతుందని చాలామంది పోలీసులకు కూడా ఫిర్యాదు చేయడం లేదు.

సైట్లలో వివరాల నమోదుతో..

డేటింగ్ సైట్ తెరవగానే.. అందులో పేరు, జెండర్, మెయిల్ తదితర వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వెబ్‌సైట్‌లోకి వెళ్లగానే.. ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే తరహాలో వివరాలన్నీ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఇందులో జెండర్, వయసు ఆధారంగా ప్రొఫైల్స్ ఉంటాయి. ఏ వయసు వారికి ఎంత వయసు కావాలి? అమ్మాయి ఇన్‌కాల్ లేదా అవుట్ కాల్ అనే ఆప్షన్స్ ఉంటాయి. అన్నీ పూర్తి చేసి అడ్వాన్స్‌గా డబ్బులు చెల్లించిన తర్వాత అటువైపు వారి ఫోన్ నంబరు పని చేయదు. ఇలా 80 శాతం పైగా సైట్లు అడ్వాన్స్ పేరుతో నగదు బదిలీ చేయించుకుని మోసం చేస్తున్నాయి. డబ్బులు తీసుకున్నాక.. పదే పదే డబ్బులు డిమాండ్ చేయడంతో ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగుతున్నారు.

రిలేషన్ పేరుతో మోసం..

నోయిడా, గుర్‌గావ్, కోల్‌కతా, బిహార్, గుజరాత్ నుంచి ఎక్కువగా డేటింగ్ నడుస్తోంది. మొబైల్స్‌కు వారే ఫోన్ చేస్తారు. డేటింగ్ తీరుతెన్నులు వివరిస్తారు. అవతలి వ్యక్తి అడ్రస్ తెలుసుకుని.. సమీపంలోని ఓ ప్రాంతం చెబుతారు. అక్కడ కొందరు మేడమ్స్ ఉన్నారని.. మెంబర్‌షిప్ తీసుకుంటే.. వారి నంబర్లు ఇస్తామని నమ్మబలుకుతారు. ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకుని ఆ తర్వాత స్విచాఫ్ చేసుకుంటారు. మూడు నెలలు, ఆర్నెల్లు, ఏడాది.. ఇలా మెంబర్‌షిప్ రేట్లు రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకుంటారు.

'స్మార్ట్' డీల్..

గూగుల్‌లోకి వెళ్లి ఆన్‌లైన్ డేటింగ్ అని టైప్ చేస్తే పలు సైట్లు కనిపిస్తాయి. వాటితో పాటు కాల్ గాల్స్ మొబైల్ నంబర్స్ ఇన్ బెంగళూరు' అని టైప్ చేస్తే ఫోన్ నంబర్లు కూడా వస్తాయి. ఫోన్ చేస్తే రేటు, ఇతర వివరాలు వివరిస్తారు. రేటు కుదిరాక వాట్సాప్‌లో హాయ్ అని టైప్ చేస్తే ఫొటోలు పంపిస్తారు. అందులోనూ అడ్వాన్స్‌గా కొంత మొత్తం తీసుకుంటారు. గంట, మూడు గంటలు, ఫుల్ నైట్.. ఇలా సమయాన్ని బట్టి రేట్లు ఉంటాయి. అడ్వాన్స్‌గా మరోసారి డబ్బులు లాగేసి.. బ్లాక్ చేస్తారు.

ఎవరూ నమ్మొద్దు



డేటింగ్ సైట్‌లను ఎవరూ నమ్మొద్దు. చట్ట వ్యతిరేక యాప్‌లో వివరాలు నమోదు చేసి మోసపోకండి. ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు చేశాక చేసేదేమీ లేదు. ముందుగానే అప్రమత్తంగా ఉండండి. వ్యభిచారం నేరం.. అలాంటి ఊబిలోకి యువత వెళ్లకండి. టెక్నాలజీని సద్వినియోగం చేసుకోండి.. దురలవాట్లకు వాడుకోకండి.

– ఎస్.వి.మాధవ్‌రెడ్డి, జిల్లా ఎస్పీ

లోకల్ నంబర్లతో హైటెక్ వ్యభిచారం..

డేటింగ్ సైట్లలో కొందరు ఆన్‌లైన్ వ్యభిచారం నిర్వహిస్తున్నారు. తెలుగులో మాట్లాడుతూ ఫొటోలతో పాటు అడ్వాన్స్‌గా రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు ఫోన్‌పే ద్వారా తీసుకుంటారు. ఆ తర్వాత ఫోన్ చేసి అడ్రస్ చెబుతారు. అక్కడికి వెళ్లగానే.. అమ్మాయిలను చూపిస్తారు. మరోసారి రేటు చెబుతారు. అదేంటని అడిగితే.. కాల్ గర్ల్‌కు ఇవ్వాలని సమాధానం ఇస్తారు. లేదంటే వెళ్లిపోండి అంటారు. ఎలాగూ డబ్బు పోయిందని.. మరింత డబ్బులు చెల్లిస్తున్నారు. ఇలాంటి హైటెక్ వ్యభిచారం ఊబిలో చాలామంది పడిపోతున్నారు.



విత్తన నాణ్యతపై సంతృప్తి



వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న డీఏఓ సుబ్బారావ్, ఏఓ శ్రీనివాసరెడ్డి

కదిరి అర్బన్: కదిరి వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో బుధవారం విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్లను జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) సుబ్బారావ్ తనిఖీ చేశారు. విత్తన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఏఓ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 29వ తేదీన రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తారన్నారు. రైతుల తమ వెంట పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, మొబైల్ ఫోన్ కచ్చితంగా తీసుకురావాలన్నారు. అర ఎకరం ఉన్న రైతుకు 30 కిలోల బ్యాగు ఒకటి, ఎకరం ఉంటే రెండు బ్యాగులు, ఎకరాకు మించి ఉంటే గరిష్టంగా మూడు బ్యాగులు చొప్పున విత్తన వేరుశనగ పంపిణీ చేస్తారన్నారు. కే–6 1694 రకం 30 కిలోల బ్యాగ్ పూర్తి ధర రూ.2,850 ఉండగా.. సబ్సిడీ రూ.1,140 పోను రైతు రూ.1,710 చెల్లించాలన్నారు. కదిరి లేపాక్షి రకం 30 కిలోల బ్యాగ్ పూర్తి ధర రూ. 2,610 ఉండగా సబ్సిడీ పోను రూ.1,566 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు పూర్తి

పుట్టపర్తి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని డీఐఈఓ రఘునాథ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 10461 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఫస్టియర్‌లో 6,809 మంది, ఒకేషనల్‌లో 692 మంది విద్యార్థులు, సెకండియర్‌లో 2,590 మంది, ఒకేషనల్‌లో 370 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్‌ఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) రోజున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పుట్టపర్తి రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో డీఎస్పీ వాసుదేవన్‌తో కలిసి సమీక్షించారు. ఆర్‌ఓ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ అనంతరం గొడవలు జరిగే సూచనలు ఉన్నాయని, లాఅండ్ ఆర్డర్ సమస్య రాకుండా ముందస్తు నివారణాచర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలు బంకుల్లో, కిరాణా అంగళ్లలో పెట్రోలు, డీజిల్ లూజు అమ్మకాలను నిషేధించామన్నారు. అక్రమ మద్యం నివారించాలని, జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులు గుంపులుగా టీ బంకులు, అంగళ్ల దగ్గర ఉండకుండా చూడాలన్నారు. పేలుడు పదార్థాలు, టపాసులు అక్రమ నిలువలు ఉన్నట్లయితే సీజ్ చేయాలని ఆదేశించారు. గత ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి కూడా బైండోవర్ జాబితా చూసుకొని ఆ ప్రకారం ప్రతి ఒక్కరినీ బైండోవర్ చేయాలన్నారు. సెక్షన్ 133(1) (సి) కింద రాళ్లు, కర్రలు, రాడ్లు ఇతర వస్తువులు నిర్మాణ పనులకు తప్ప ఇతర వాటికి వాడరాదన్నారు. ప్రజలకు అవగాహన పెంచి అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి, నల్లమాడ, బుక్కపట్నం, కొత్తచెరువు తహసీల్దార్లు వేణుగోపాల్, నాగభూషణ, భారతి, కళావతి, డీఏఓ వెంకటస్వామి, నరసింహులు, ఖాజాబీ, రామనాథరెడ్డి, సీఐలు కొండారెడ్డి, రాజారమేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పొలం బాట



పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు



విత్తన కాయలకు రిజిస్ట్రేషన్ చేస్తున్న రైతులు

- ఆశాజనకంగా ఖరీఫ్ సీజన్
- విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- గ్రామంలోనే విత్తనాలు, ఎరువుల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: తొలకరి వర్షాలతో ఖరీఫ్ –2024 సీజన్ ఆశాజనకంగా కనిపిస్తోంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. రైతులు ముంగారు సేద్యానికి ఉత్సాహంగా కదులుతున్నారు. జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,44,763 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఖరీఫ్‌లో సాధారణంగా 1,74,910 హెక్టార్లలో పంటలు సాగు చేస్తారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా 1.10 లక్షల హెక్టార్లకే సాగు పరిమితమైంది. ఈసారి ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. ఈ నెల 17న 3 మండలాల్లో 18.8 మి.మీ వర్షపాతం నమోదైంది. 18వ తేదీ 16 మండలాల్లో 366.2 మి.మీ, 19న 24 మండలాల్లో 450.3 మి.మీ, 20న 18 మండలాల్లో మొత్తం 389.6 మి.మీ, 21న 31 మండలాల్లో అత్యధికంగా 649.6 మి.మీ, ఇక 22వ తేదీ 6 మండలాల్లో 66 మి.మీ వర్షం నమోదైంది. ఈ వర్షాలతో సాగు విస్తీర్ణం పెరగనున్నట్లు తెలుస్తోంది.

ఊపందుకున్న విత్తన రిజిస్ట్రేషన్లు..

ఖరీఫ్‌లో అతి ముఖ్యమైన వర్షాధార పంట వేరుశనగ. దీనిపై లక్షలాది మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. ఇటీవల వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తన వేరుశనగ కాయలను సబ్సిడీపై అందజేసేందుకు జిల్లాలోని 416 రైతు భరోసా కేంద్రాల్లో విత్తన రిజిస్ట్రేషన్లు ప్రారంభించింది. దీంతో రైతులు రిజిస్ట్రేషన్లకు క్యూ కట్టారు. 30 కిలోల బస్తా వేరుశనగ సబ్సిడీపై రూ.1,710కు అందజేస్తుండడంతో రైతులు డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. వేరుశనగ ఆర్‌బీకేలకు చేరగానే రైతులకు పంపిణీ చేయనున్నారు. రెండు రోజుల్లోనే దాదాపు 23,630 మంది రైతులు 20 వేల క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. విత్తన వేరుశనగతో పాటు కందులు, రాగులు, పెసలు, అలసందలు, ఉలవలు, కొర్ర, జీలుగ విత్తనాలను 40 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేయనుంది. దీంతో పాటు అవసరమైన యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ తదితర రకాల ఎరువులు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ..

జిల్లాలో గత ఏడాది పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మార్చిలో రావాల్సిన ఈ పరిహారం ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యమయ్యింది. ఎట్టకేలకు గత నాలుగు రోజుల నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతోంది. జిల్లాలో 21 కరువు మండలాలను కరువు జాబితా కింద ప్రకటించిన ప్రభుత్వం... అందులోని 1,17,005 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.105.03 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తం ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపయోగకరమని రైతులు పేర్కొంటున్నారు.

సాగుకు శుభసూచకం



ఇటీవల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ట్రాక్టర్ల సాయంతో పొలాలను చదును చేస్తున్నాం. కాడెద్దులు కరువవడంతో ప్రతి రైతూ ట్రాక్టర్లపైనే ఆధారపడ్డారు. వర్షాలు బాగా కురిస్తే ప్రతి రైతూ వ్యవసాయం బాట పడతారు. ముందస్తుగా కురుస్తున్న ఈ వర్షాలు వ్యవసాయానికి శుభసూచకం.

– రమణారెడ్డి, జగరాజుపల్లి

విత్తన రిజిస్ట్రేషన్ చేయించాం



ఖరీఫ్‌లో సాగు చేయడానికి అవసరమైన విత్తన వేరుశనగ కాయల కోసం ఆర్‌బీకేలో రిజిస్ట్రేషన్ చేయించాం. గతంలో మాదిరి విత్తనాల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని తప్పింది. విత్తనాలతో పాటు ఎరువులు, కందులు, అన్ని రకాల విత్తనాలను అందజేయడం చాలా సంతోషంగా ఉంది.

– రంగనాథ్, ఇరగరాజుపల్లి

ప్రతి రైతుకూ విత్తనాలిస్తాం



ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి రైతుకూ సబ్సిడీపై విత్తన కాయలు అందజేస్తాం. జిల్లాకు సుమారు లక్ష క్వింటాళ్ల విత్తన వేరుశనగ వస్తుంది. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. వేరుశనగతో పాటు కందులు, ఎరువులు అందజేస్తాం. ఈ వర్షాలకు రైతులు తమ పొలాలు సిద్ధం చేసుకోవాలి.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

వైభవం.. నృసింహుని జయంత్యుత్సవం



విశేష అలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామి జయంతి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. స్వామి మూలవిరాట్‌కు వేకువజామునే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ మూర్తుల ఊరేగింపు కనులపండువగా జరిగింది. సింహ, చంద్రప్రభ వాహనాలపై స్వామి ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

పాత రథం పరిశీలన

బ్రహ్మోత్సవాల్లో వినియోగించనున్న పాత రథాన్ని బుధవారం ఆర్అండ్‌బీ జేఈ కావ్య పరిశీలించారు. పాత రథానికి చేపట్టిన మరమ్మతు పనుల గురించి ఆలయ ఈఓ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

వైభవం.. సత్యసాయి శ్రీగిరి రథోత్సవం

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తిలో పున్నమి శోభ సంతరించుకుంది. పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద అందంగా అలంకరించి సత్యసాయి చిత్రపటాన్ని రథంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగుతూ ఊరేగింపుగా ప్రశాంతి నిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్ బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఈ ఉత్సవంలో దేశ విదేశీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సత్యసాయి శ్రీగిరి రథాన్ని లాగుతున్న భక్తులు

క్లుప్తంగా

వైభవంగా ఆదిదంపతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం

కొత్తచెరువు: మండల కేంద్రంలో వెలసిన సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆదిదంపతుల కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కిమ్స్‌-సవీరలో ఆరోగ్య శ్రీ సేవలు

అనంతపురం మెడికల్: నగరంలోని కిమ్స్‌–సవీర ఆస్పత్రిలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఎంప్లాయీస్ హెల్త్ స్కీం, ప్రభుత్వ ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్‌తో కూడిన వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ మేరకు ఆ ఆస్పత్రి యాజమాన్యం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

మాజీ నక్సలైట్ అరెస్ట్

పావగడ: తాలూకాలోని తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలో 19 ఏళ్ల క్రితం జరిగిన వెంకటమ్మనహళ్లి పోలీస్ హత్యాకాండలో నిందితుడైన మాజీ నక్సలైట్ కొత్తగేరి శంకర్‌ను ఎట్టకేలకు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. 2005లో తాలూకాలోని వెంకటమ్మనహళ్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పోలీసుల క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అదే ఏడాది ఫిబ్రవరి 10న రాత్రి 10.30 గంటలకు పాఠశాలను పెద్ద సంఖ్యలో నక్సలైట్లు చుట్టుముట్టి బాంబులు వేసి, తుపాకులతో కాల్పులు జరిపారు. ఘటనలో ఏడుగురు జవాన్లు అమరులయ్యారు. ఈ సంఘటనకు సంబంధించి అప్పట్లో తిరుమణి పోలీస్ స్టేషన్‌లో కేసు దాఖలైంది. అప్పటి నుంచి పోలీసుల కళ్లు గప్పి తిరుగుతూ జనజీవన స్రవంతిలో కలసి పోయిన కొత్తగేరి శంకర్ బుధవారం అనూహ్యంగా పోలీసులకు పట్టుబడ్డాడు.

నేడూ ఇంటర్ ఫీజు చెల్లించొచ్చు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు తత్కాల్ కింద గురువారం కూడా చెల్లించవచ్చు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే సమయం ఇస్తూ ఇంటర్ బోర్డు కమిషనర్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఎవరైనా ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణనాయక్ కోరారు. తత్కాల్ కింద రూ. 3 వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక చొరవ తీసుకుని ఎవరైనా ఫీజు చెల్లించని వారు ఉంటే తల్లిదండ్రులతో మాట్లాడి ఫీజు చెల్లించేలా చూడాలని ఆదేశించారు.

భద్రత వెరీ స్ట్రాంగ్

- జూన్ 4న ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం
- జిల్లాలో 24 గంటలూ పటిష్ట నిఘా
- గ్రామాల్లో గొడవలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్

హిందూపురం అర్బన్: ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసి 10 రోజులైంది. కౌంటింగ్‌కు 12 రోజుల సమయం ఉంది. కౌంటింగ్ క్షణాలు దగ్గర పడుతున్న కొద్దీ సర్వత్రా ఉత్కంఠ నెలకొంటోంది. ఈ క్రమంలో పోలీసులు జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్..

వచ్చే నెల 1న ఎగ్జిట్ పోల్స్, 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఫలితాలు వెలువడే వరకూ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడే ముందు కాని తరువాత కాని పట్టణాలు, గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, స్టేజ్ ప్రోగ్రామ్‌లకు ఎలాంటి అనుమతులు మంజూరు చేయడం లేదు. ఈ విషయంగా ఇప్పటికే ఎస్పీ మాధవరెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

రెచ్చగొడితే తీవ్రమైన నేరంగా పరిగణింపు..

ప్రజలను రెచ్చగొట్టేలా రాజకీయ నాయకులు సందేశాలు ఇవ్వడం, నిరాధారమైన ఆరోపణలు చేయడం, రచ్చబండ చర్చలు, సోషియల్ మీడియాలో ప్రచారాలకు చేయడం వాటిని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నట్లు ఇప్పటికే అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పలు చోట్ల చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలు దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ బాటిళ్లు, క్యాన్ల విక్రయాలపై నిషేధం విధించారు. బాణాసంచా అమ్మకాలను నియంత్రించారు. ధాబాలు, హోటళ్లలో అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా తనిఖీలు ముమ్మరం చేశారు. చట్టవిరుద్ధమైన కాయిన్‌గేమ్, బెట్టింగ్‌లు అరికట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత..

హిందూపురం సమీపంలోని బిట్ కళాశాల, లేపాక్షి మండలం చోళసముద్రం సమీపంలోని గురుకుల పాఠశాలలో జిల్లాలోని హిందూపురం లోక్‌సభ, ఆరు నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌లను నిత్యం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తరచూ తనిఖీలు చేస్తున్నారు. జూన్ 4న కౌంటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో ఆ రోజు హిందూపురంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారు ఉంటూ ఎన్నికల ఫలితాలు సమీక్షించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే అన్ని లాడ్జీలు బుక్ అయ్యాయి. కొంత మంది కల్యాణ మంటపాలు, ఫంక్షన్ హాళ్లనూ బుక్ చేశారు. ఈ సమాచారంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. లాడ్జీల్లో అపరిచిత వ్యక్తులపై నిఘా పెంచారు.

పెరిగిన తనిఖీలు జోరు..

కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడుతున్న తరుణంలో హిందూపురం, కదిరి, ధర్మవరం, మడకశిర, పెనుకొండ తదితర ప్రధాన పట్టణాల్లోని పలు వార్డుల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. గ్రామాల్లోనూ వివిధ వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రశాంతతకు సహకరించాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల రోజు కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే ఎదుర్కొవాల్సిన పరిణామాలపై చైతన్య పరుస్తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్లు, పెట్రోలింగ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లను బైండోవర్ చేసే ప్రక్రియను వేగవంతం చేశారు.



చిలమత్తూరు మండలం పాతచామలపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ కంజాక్షన్



కార్డన్ సెర్చ్‌లో భాగంగా ఇంటింటి తనిఖీలు చేస్తున్న దృశ్యం

మద్యం మత్తులో వ్యక్తి హత్య



రోదిస్తున్న హతుడి కుటుంబీకులు

పావగడ: మద్యం మత్తులో చోటు చేసుకున్న ఘర్షణ చివరకు ఓ వ్యక్తి హత్యకు దారి తీసింది. పోలీసులు తెలిపిన మేరకు.. పావగడలోని బాబయ్య గుడి వీధిలో నివాసముంటున్న టపాలు లక్ష్మీనారాయణ (40)కు భార్య లక్ష్మి, తల్లి అంజినమ్మ ఉన్నారు. టెంకాయల పీచు తొలగించే కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి స్థానిక మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోం వెనుక గుర్తు తెలియని వ్యక్తులు దుడ్డుకర్రతో దాడి చేయడంతో లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం ఈ విషయం వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సైతం అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. మద్యం మత్తులో చోటు చేసుకున్న ఘర్షణలే ఇందుకు కారణంగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. చుట్టుపక్కల దుకాణాల వద్ద అమర్చిన సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

16 ద్విచక్ర వాహనాల స్వాధీనం



పట్టుబడిన వాహనాలను చూపుతున్న పోలీసులు

హిందూపురం అర్బన్: ఎన్నికల వేళ హిందూపురం పట్టణంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. బుధవారం చేపట్టిన తనిఖీల్లో ఎలాంటి రికార్డులు లేని 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వాహనాల ఛాసీ నంబర్ ఆధారంగా విచారణ చేపట్టినట్లు వివరించారు.

కాకి గ్రామంలో ప్రబలిన అతిసార



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

- 30మందికి పైగా అస్వస్థత

రొళ్ల: మండలంలోని కాకి గ్రామంలో అతిసార ప్రబలింది. రెండు రోజులుగా వాంతులు, విరేచనాలతో దాదాపు 30 మందికి పైగా బాధపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి కలుషిత నీటిని తాగడం వల్ల అతిసార ప్రబలినట్లు గ్రామస్తులు తెలిపారు. తీవ్ర అస్వస్థతకు గురైన హనుమంతరాయప్ప, నాగమ్మ, నాగప్ప, పద్దమ్మ, మంజునాథ్, కుశాల్, పుట్టిరమ్మ, మూర్తి, నంజుండప్ప, నాగరాజు, కవిత, మహాలక్ష్మి, రత్నమ్మ, శశికుమార్‌తో పాటు మరికొందరిని కర్ణాటకలోని మధుగిరి, రొళ్ల సీహెచ్‌సీతో పాటు మడకశిర ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న రొళ్ల పీహెచ్‌సీ వైద్యా బృందం బుధవారం గ్రామంలో పర్యటించింది. ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న రోగుల రక్త నమూనాలను సేకరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, ఈఓఆర్డీ కృష్ణప్ప తదితరులు గ్రామాన్ని సందర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గురువారం గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు అందించనున్నట్లుగా అధికారులు తెలిపారు.

ఏఐఐబీ పనుల పూర్తికి గడువు పొడిగింపు

- పీఆర్ ఎస్ఈ ఈరాస్వామి

అనంతపురం సిటీ: ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ఉద్దేశించిన ఏసియన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) రుణ సాయంతో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన రహదారులు, వంతెన (ఏఐఐబీ) నిర్మాణాల పూర్తికి మరో ఆరు నెలల గడువు పెంచినట్లు పంచాయతీరాజ్ ఎస్ఈ ఈరాస్వామి తెలిపారు. ఏఐఐబీ పనుల పురోగతిపై అనంతపురంలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా అధికారులతో కలసి ఆయన సమీక్షించారు. ఈఈలు డీఎల్ శ్రీనివాసులు, కేవీకేవీ ప్రసాద్, డీఈఈలు రామచంద్రారెడ్డి, మల్లికార్జున, రామ్మోహన్, హనుమంతయ్య శెట్టి, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, ఏఈఈలు పాండురంగారెడ్డి, ఇతర ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.468 కోట్లతో 332 పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో అనంతపురం జిల్లాలో ఏఐఐబీ కింద రూ.268 కోట్లతో 138 పనులు చేపట్టినట్లు ఈఈ ప్రసాద్ తెలిపారు. 178 కిలో మీటర్ల మేర పనులు పూర్తి చేశామన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో రూ.211.69 కోట్లతో 194 పనులు మంజూరైనట్లు ఈఈ డీఎల్ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో 192 కిలోమీటర్ల మేర పూర్తి చేశామన్నారు. ఇదే అంశానికి సంబంధించి ఎస్ఈ మాట్లాడుతూ.. ఏఐఐబీ పనుల పూర్తికి గడువును ప్రభుత్వం మరో ఆర్నెళ్ల పాటు పొడిగించిందన్నారు. డిసెంబర్ నెలాఖరుకల్లా వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న పీఆర్ ఎస్ఈ ఈరాస్వామి, చిత్రంలో ఈఈలు శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు

ముగిసిన ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

అనంతపురం: ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ సౌజన్యంతో ఏ–1 చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన సీనియర్ ఓపెన్, మహిళా చెస్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిసాయి. 5కు 5 పాయింట్లు సాధించి చాంపియన్ షిప్‌ను కె.రామసాయి దక్కించుకున్నారు. రన్నరప్‌గా అమ్మినేని ఉదయకుమార్ నాయుడు నిలిచారు. మూడో స్థానంలో కృష్ణ సుధీంద్ర వెంకట సముద్రాల, నాల్గో స్థానంలో కుశాల్ నిలిచారు. అలాగే జిల్లా మహిళా చెస్ చాంపియన్‌షిప్–2024 టైటిల్‌ను శ్రీహజి దక్కించుకున్నారు. రన్నరప్‌గా అస్మిత అనిమి, మూడో స్థానంలో యశస్విని అనిమి, నాలుగో స్థానంలో కటారి భువనకృతి నిలిచారు. సీనియర్ ఓపెన్ విభాగంలో ఎంపికైన విజేతలు 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. మహిళా విభాగంలో ఎంపికైన విజేతలు 25, 26 తేదీల్లో హిందూపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించనున్నారు.

ప్రాణం తీసిన వివాహేతర బంధం

- బేల్దారి ప్రసాద్ హత్య కేసులో వీడిన మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్

గుంతకల్లు టౌన్: వివాహేతర బంధం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. తమ అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని బేల్దారి బోయ దేవేంద్రప్రసాద్(39)ను ఆయన భార్య ప్రియుడు హతమార్చిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం గుంతకల్లు వన్‌టౌన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రామసుబ్బయ్య వెల్లడించారు. గుంతకల్లులోని అంకాలమ్మ గుడి వీధిలో నివాసముంటున్న దేవేంద్రప్రసాద్ బేల్దారిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్నేళ్ల క్రితం కవితతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. కాగా, కవితకు పెళ్లి కాక ముందే గుంతకల్లు మండలం నెలగొండకు చెందిన ఆమె సమీప బంధువు సుద్దికుంట సోమశేఖర్‌తో వివాహేతర సంబంధం ఉండేది. ప్రసాద్‌తో వివాహమైన తర్వాత కూడా ఆమెతో సోమశేఖర్ అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తూ తరుచూ ఇంటికెళ్లొచ్చేవాడు. ఏడాది క్రితం ఈ విషయాన్ని గుర్తించిన ప్రసాద్ ఇద్దరినీ మందలించాడు. అప్పటి నుంచి కవిత ఇంటికి సోమశేఖర్ వెళ్లేవాడు కాదు. అయితే ఎలాగైనా ప్రసాద్ అడ్డు తొలగించుకోవాలని భావించిన సోమశేఖర్ పథకం రచించాడు. ప్రసాద్‌తో కలసి బేల్దారి పనిచేసిన విడపనకల్లు మండలం కడదరబెంచి గ్రామానికి చెందిన జలపతి పెద్దరాయుడిని లోబర్చుకున్నాడు. ఈ నెల 14న రాత్రి మందు పార్టీ పెట్టుకుందామని ప్రసాద్‌కు పెద్దరాయుడితో ఫోన్ చేయించాడు. దీంతో పెద్దరాయుడిని ప్రసాద్ కలిశాడు. ఇద్దరూ కలసి గుంతకల్లు శివారులోని కల్వరి టెంపుల్ సమీపంలో ఉన్న నల్లరేగడి పొలంలో పీకల్లోతు మందు తాగారు. ఆ సమయంలో ప్యాపిలి రాముడుతో కలసి అక్కడకు చేరుకున్న సోమశేఖర్ నైలాన్ తాడుతో ప్రసాద్ గొంతు బిగించాడు. ఊపిరి ఆడక పెనుగులాడుతున్న ప్రసాద్‌ను ప్యాపిలి రాముడు గట్టిగా పట్టుకున్నాడు. కాసేపటి తర్వాత ప్రసాద్ ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి ముగ్గురూ జారుకున్నారు. 15వ తేదీ ఉదయం పొలాల్లో ప్రసాద్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి తండ్రి లక్ష్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో హత్యగా నిర్ధారించారు. విచారణ అనంతరం సోమశేఖర్, పెద్దరాయుడు, ప్యాపిలి రాముడిని పక్కా ఆధారాలతో అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అంజూర సాగు.. లాభాలు బాగు



చెట్టుకు కాసిన అంజూర కాయలు



అంజూర పండ్లను ఎండబెట్టిన దృశ్యం



ఎగుమతుల కోసం సిద్ధం చేస్తున్న డ్రైఫ్రూట్స్

- డ్రైఫ్రూట్స్‌గా మార్చి మూడు రాష్ట్రాలకు ఎగుమతి
- 16 ఎకరాల్లో అంజూర పంట సాగు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- ఆదర్శంగా నిలిచిన రైతు సోదరులు జగదీష్ నాయుడు, రమేష్‌నాయుడు

పెద్దపప్పూరు: మనసు పెట్టి వ్యవసాయం చేస్తే సాధించలేనిది ఏది లేదు అంటూ నిరూపిస్తున్నారు జిల్లాకు చెందిన రైతులు. అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని అధిక లాభాలను గడిస్తున్నారు. ఈ క్రమంలోనే పెద్దపప్పూరు మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన రైతు సోదరులు జగదీష్ నాయుడు, రమేష్‌నాయుడు అంజూర సాగుతో అందరికీ ఆదర్శంగా నిలిచారు.

ఎంబీఏ పూర్తి చేసి.. ఉద్యోగానికి వదులుకుని

ధర్మాపురం గ్రామానికి చెందిన జగదీష్ నాయుడు ఎంబీఏ పూర్తి చేసి బెంగళూరు, అనంతపురం నగరాల్లోని ప్రముఖ ఫైనాన్స్ కంపెనీల్లో ఉన్నత శ్రేణి ఉద్యోగం చేశారు.. ఈ క్రమంలోనే రాయన్నపల్లికి చెందిన ఓ రైతు సాగు చేస్తున్న దానిమ్మ తోటను తరచూ సందర్శించేవారు. ఆ రైతు స్ఫూర్తితో తాను కూడా వ్యవసాయం చేయాలని భావించిన ఆయన వెంటనే ఆ దిశగా అడుగులు వేశాడు. తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి అనంతపురం రూరల్ పరిధిలోని కామారుపల్లిలో 7 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. తొలుత దానిమ్మ పంట సాగు చేద్దామనుకున్న జగదీష్ నాయుడు... ఊహించని విధంగా అంజూర సాగుపై దృష్టి సారించారు. రాయన్నపల్లికి చెందిన రైతు ద్వారా అమెరికా నుంచి డయానా రకం 10 వేల అంటు మొక్కలను తెప్పించుకుని 2015, నవంబర్‌లో పొలంలో నాటారు. అమెరికా ఉంచి అంట్లు తెప్పించుకున్నందుకు ఒక్కో మొక్కకు రూ.60 వరకు ఖర్చు వచ్చింది.

ప్రయోగం విజయవంతం

కామారుపల్లిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన అంజూర సాగు విజయవంతమై లాభాలు రావడంతో సోదరుడు రమేష్‌నాయుడు ద్వారా స్వగ్రామం ధర్మాపురంలోని తమ సొంత పొలం నాలుగు ఎకరాల్లో అంజూర మొక్కలు నాటించారు. మొక్కలు నాటిన ఎనిమిది నెలలకు పంట చేతికి వచ్చింది. పంట సాగు కోసం తొలుత ఎకరానికి రూ.50వేలు చొప్పున పెట్టుబడి పెట్టగా తొలి కాపులోనే పెట్టిన పెట్టుబడి మొత్తం చేతికి అందింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో అంజూర రూ.90 నుంచి రూ.110 ధర పలుకుతోంది. మొక్క నాటిన రెండేళ్ల తర్వాత ఎకరానికి దాదాపు రెండు టన్నుల వరకు పంట దిగుబడి వస్తుంది.

వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి..

తొలి దశలో ప్రయోగాత్మకంగా చేపట్టిన అంజూర సాగులో ఊహించని లాభాలు రావడంతో రైతు జగదీష్ నాయుడు మరో అడుగు ముందుకు వేశారు. కేవలం పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకోవడమే కాకుండా వాణిజ్య స్థాయిలో ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయాలనే ఆలోచనతో డ్రై అంజూర ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. దీంతో రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టి ప్రత్యేకంగా షెడ్ నెట్‌తో గది ఏర్పాటు చేశారు. నిర్దిష్టమైన ఉష్ణోగ్రతలు ఉండేలా చర్యలు తీసుకుని తాను పండించిన నాణ్యమైన అంజూర పండ్లను డ్రై ఫ్రూట్స్‌గా మార్చి రెండింతల ఆదాయాన్ని గడించసాగారు. కేవలం సేంద్రియ ఎరువులనే వినియోగిస్తుండడంతో నాణ్యమైన పంట ఉత్పత్తులు చేతికి అందుతున్నాయి. వీటికి డిమాండ్ భారీగా నెలకొంది. దీంతో ఆంధ్రలోని వివిధ జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాలకు ఎగుమతులు చేపట్టారు. ఫోన్ చేసి ఆర్డర్ ఇవ్వగానే కిలో అంజూర డ్రై ఫ్రూట్స్‌ను రూ.800 నుంచి రూ.వెయ్యి చొప్పున కొరియర్ ద్వారా అందజేస్తున్నారు. అంజూరా పంటను సాగు చేస్తే లాభాలే తప్ప నష్టం అనే మాటనే ఉండదంటూ రైతులను చైతన్య పరుస్తూ వారికి అందుబాటులో ఉండేలా స్వయంగా తానే అంటు కట్టిన మొక్కలను విక్రయించసాగారు. ఒక్కో మొక్కను రూ.10 నుంచి రూ.18 చొప్పున అమ్ముడు పోతోంది.

డ్రైఫ్రూట్స్‌గా మారిస్తే లాభం ఎక్కువ



అంజూర పంటను మార్కెట్‌లో అలాగే విక్రయిస్తే కిలో రూ.90 నుంచి రూ.120తో అమ్ముడుపోతోంది. అదే పంటను డ్రైఫ్రూట్‌గా మార్చి విక్రయిస్తే కిలో రూ.800 నుంచి రూ.1000 వరకూ ధర పలుకుతోంది. సేంద్రియ ఎరువులతో పంట పండిస్తున్నాం. దీంతో పంట దిగుబడులు ఎంతో నాణ్యతతో ఉంటున్నాయి. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. ఆంధ్రలోని పలు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. ఏటా 10 నెలల పాటు దిగుబడి వస్తూనే ఉంటుంది.

– రైతు రమేష్‌నాయుడు, ధర్మాపురం, పెద్దపప్పూరు మండలం

ఎలాంటి తెగుళ్లు వ్యాపించవు



అంజూర పంట సాగులో తెగుళ్ల బాధ ఉండదు. పంట సాగులో అధిక ప్రాధాన్యత సేంద్రియ ఎరువులకే ఇవ్వాలి. అప్పుడే పంట దిగుబడి ఎక్కువగా ఉంటుంది. నాణ్యత కూడా అలాగే ఉంటుంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు అంజూరా పంట సాగు ఎంతో ఆసరాగా ఉంటుంది. మార్కెట్లో ఒక కిలో డ్రై అంజూరా రూ.800 వరకు ధర పలుకుతుంది. అంజూర సాగుపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడమే కాక, సొంతంగా మేమే అంటు కట్టిన మొక్కలను విక్రయిస్తున్నాం.

– జగదీష్‌నాయుడు, ధర్మాపురం